# "ఋణానుబంధ రూపేణా...."

నిడదవోలు మాలతీ

"అయితే ఆ మిషను ఏమైంది మామయ్యా" అన్నాను భయపడుతూ భయపడుతూ.

ఆయన మామయ్య కాదు కాని పెద్దవాళ్ళని పేరుపెట్టి పిలవకూడదు గనుక...

'చంపేశావ్, నేను మర్చేపోయాను' అన్నారు మామయ్య.

ఏంచెప్పను?—

"అఖిలభారత కుట్టుయంత్రాల" చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపదగిన ఒక మహద్యంత్రాన్ని పట్టుకొని "మర్చేపోయాను" అంటూంటే. తన సొమ్ము కాదుగనుకనే తీసుకెళ్ళి ఎవడో చచ్చిపోయిన దివాన్‌గారి జవాన్ (చచ్చిపోయింది జవానుకి) ఎరువిచ్చి తిరిగి చూడకుండా ఊరుకో గల్గాడు!

* * *

రెండు సంవత్సరాల క్రిందట—

తిథివార నక్షత్రాలన్నీ కూడిన ఒకానొక శుభ సమయంలో టైలరు జాకట్లు పాడుచేసి తీసుకొచ్చాడు.

స్కెచ్

"ఒక మిషను కొనేద్దాం అమ్మా" అన్నాను.

"కొనేద్దాం" అంది అమ్మ.

రెండురోజుల అనంతరం "మంగళవారం శంకరం మిషన్ తెస్తాడు" అని చెప్పింది.

నేను సోమవారం వెళ్ళి జాకట్ పీసెస్ తెచ్చేశాను.

మంగళవారం నేను స్కూల్‌నుంచి వచ్చేసరికి మిషను ఇంట్లోఉంది! నా పుట్టిన రోజుకేనా అంత సంతోషంలేదు! ఆత్రుతగా మూత తీశాను!

కళ్లు తిరిగాయ్!

"సెకండ్ హాండా" అన్నాను సహించచ్చి.

"అయితే ఏం? మిషన్‌చూడు." అన్నాడు శంకరం గంభీరంగా.

మరోమాటు చూశాను. దానికి షటిలూ, బాబిన్నూ లేవు. హాండ్‌వీల్ ఉందికాని దీనికి ఎటాచ్ చెయ్యాలి. కొన్ని స్క్రూలు లూస్‌గా ఉన్నాయి. కొన్ని ఊడిరావడమే లేదు. మిషన్ అనిపించుకొనే ఒక ఇనప డొక్కులో అంతకన్న ఉండగల లోపాలేమిటో నాకు తెలిదు.

ఎలాగైతేనేం—ఆ యంత్రాన్ని బాగుచేయడానికి ఇచ్చాం. పదిరోజు లవుతుంటే, అది మనదికాదనీ, ఆ మిషన్ గలవారు ఢిల్లీ వెళ్ళిపోతున్నారనీ (అక్కడ రిపేర్ చేసేవాళ్ళు లేరనీ!) యమర్జంటుగా కావాలనీ మంగళవారం ఇచ్చెయ్యమనీ చెప్పాం. అదుర్దామరి! "అలాగే నండీ" అన్నాడు వ్యాపార లక్షణంగా.

పైన వివరించబడిన "మంగళవారం" మూడు మాట్లు గతించింది. నా జాకెట్ పీసెస్ అయితే పురుగులు కొట్టేశాయ్ కూడాను.

"చూడమ్మా! చిట్టితల్లీ! స్కూల్నించి వచ్చేప్పుడు ఒకమాటు అడగవే, దార్లోనేకదా ఉంది". అని బ్రతిమాలితే అది మరీ ఎగిరింది, "నే వెళ్ళను ఆ షాపుకి. ఆ రాస్కెలు మన మాటయినా వినిపించుకోడూ!" దొరగారూ తమర్నేనండీ" అని చెప్పాలి. కలకత్తా నుంచి సామాను రావాలంటాడు."

'కలకత్తా ఏమిటే మాతో జర్మనీ అనిచెప్పాడు.'

"ఏమో నాకేం తెలుసూ!" అంది.

పచ్చి అబద్ధం. అమ్మతో నేఁ చెప్తుంటే అది వినడం నేను చూశాను. ఏంచెయ్యను. కాలగతి లెమ్మని ఊరుకొన్నాను. అప్పటికి మిషనుమీద అభిమానం మూడువంతులు చచ్చింది.

"మంచిగొడవే తగిలించేవోయ్." అంది అమ్మ శంకరాన్ని చూడగానే "నేనేం చేశానండీ!" అన్నాడు తెల్లపోతూ.

"ఆ రిపేరర్ చూడు ఏంచేస్తున్నాడో."

"ఇంతా చేస్తే అది పనిచేస్తుందా" అన్నాను నేను.

"చూస్తూ ఉండు అది ఎంత మంచిమిషన్ తెల్సా?"

"చాలా మంచిది. అసలు అలెగ్జాండర్‌కి పురుషోత్తముడు పంపిన ఉత్తమ కానుకల్లో ఇదొకటి."

"ఇదేమాట గుర్తుంచుకో. ఆదివారం మిషన్ తెస్తాను" అని శంకరం వెళ్ళిపోయాడు. సూర్య చంద్రులు తప్పకుండా "అన్న ప్రకారం" ఆదివారం మా మిషను మాకిచ్చేశాడు. భోజనాలు సగంలో ముగించి గబగబ మిషనుదగ్గిర చేరాం అంతా. అక్కకి కత్తిరింపులు వచ్చుగనక (నాకు రావుగనకనూ) అది కత్తిరించడానికీ, నేను కుట్టడానికీ ఎగ్రిమెంట్ జరిగింది.

"నేను ఇది తిప్పుతానే" అంటూ తయారయింది ముద్దుల చెల్లి.

"పిల్లేదు వెళ్ళు. ఆరువేల తొమ్మిదివందల ఎనభైమూడుని అయిదు లక్షల ఏడువందల ఆరవై మూడువేలు పెట్టి హెచ్చించి తీసుకురా" అన్నాను మందలింపుగా.

"అ...మ్...మ్...మ్మా" కెనడా ఇంజన్‌లా కూత బెట్టింది.

"స్..స్..స్...ముయ్యినోరు. నడు అవతలికి. లెఖ్ఖలు చెయ్యకపోతే నాన్నగారితో చెప్తాను. తెలుస్తోందా?"

"అయితే నాకు రుమాళ్ళు కుట్టిస్తావా?"

"నీకెందుకూ రుమాళ్ళు?"

"అన్నీ మాసిపోయాయి."

"నాన్సెన్స్. నీ దగ్గిర మాయడమేమిటి? రంగు మారుతుందంతే. ఆ తరవాత నిప్పులో వేస్తే కాలవు, నీటిలో వేస్తే నానవు."

"అం...మ్...మ్..." రెండో ప్రసారంతో అక్క బాధపడింది.

"అబ్బబ్బ. కుట్టిస్తాననకూడదా. నువ్వెళ్ళు చంపకం ఊరికే చంపక. నేను కుట్టాను" అంది.

"చూడు కుట్టినవి"అన్నాను రెండు అక్క ముందు పరోస్తూ, "రెండిట్లోనూ మూడోది బాగావచ్చినట్టుంది."

"అబ్బే. ఇదీ ఇక్కడ కుట్టుబాగానే వచ్చింది." అంది క్రిందమడిచిన అంచు చూపిస్తూ.

"అవును సుమా." అన్నాను అక్కడ అసలు కుట్టేపడలేదు!

"ఆ మాత్రం చేతకాదూ!" అనేసరికి నా అభిమానం నిజంగా దెబ్బతింది.

"ఊఁ. గీతలు గీసుకోని పకపక కత్తిరించేసినట్టే ఇవతల మడత చూసుకోవాలి. బాబిన్‌లో దారం చూడాలి. లైను తప్పకుండా చూడాలి. సూది దగ్గిర దారం చూస్తూ నాన్‌కో ఆపరేట్ చేస్తూంది. Needle and Thread కి బాగా ప్రాక్టీసవుతోంది. ఎన్ని పాట్లు ఈ బొక్కి మిషన్‌తో! కత్తిరింపులు ఏముంది. మూడేళ్ళపిల్ల చెయ్యగలదు కత్తెర అందిస్తే"ఎంత కొత్తపార్టులు వేసినా అది సెకెండ్ హాండే మరి!

* * *

మూడు నెలలు పోయాయి.

ఒకరోజు మామూలుగానే స్కూలికి వెళ్ళాను. స్కూలు అయిపోగానే మామూలుగా తిరిగిరాగానే మామూలుగా కనిపించే మిషను కనిపించలేదు.

"చంద్రం వచ్చాడు. అతని కూతురు అదేదో పరీక్ష కెళ్తుందట."

"అదేదో పరీక్షకి అవిడెవరో వెళ్తే మనమిషను ఎందుకు?"

"నాలుగు రోజులు వాడుకోని ఇచ్చేస్తానన్నాడు." అంది అమ్మ.

ఆవేళ (ఆవేళనుంచి) మిషనుతో అవుసరంగల పన్నులన్నీ నాకు తటస్థించాయో లెక్కలేదు. గత రెండునెలలనుంచి కనిపించని గలీబులు,జాకట్లు రుమాళ్ళు ఒకటేమిటి అన్నీను. అదే కాబోలు మానవ నైజమంటారు!

బర్మాషెల్ కేలండర్ ప్రకారం ఎనిమిది నెలలు గడిచేయికాని మామయ్య లెఖ్ఖ ననుసరించి నాలుగురోజులు అవలేదు. (ఇటువంటి విషయాల్లో ఆయనది బ్రహ్మకల్పం అనుకుంటా!) ఆ తరువాత రెండుసార్లు కనిపించాడు కాని ఈ విషయం ఎత్తితే "రేపు పంపించాస్తాన్లేవే" అనేవాడు మొహంచిట్లించి.

ఏదో పనిమీద ఢిల్లీవెళ్ళిన శంకరం ఆరోజే వచ్చాడట మర్నాడు మాయింటికి వచ్చాడు.

"అన్నట్టు — మిషన్ — ఏదీ? వర్కింగేనా?" అన్నాడు హఠాత్తుగా.

"వర్కింగ్ కాదు. వాక్ అవుట్ అయింది."

"ఏం ఏమయింది?"

"మా చంద్రం మావయ్య లేడూ? ఆయనేమో కూతురు పరీక్షకెళ్తోందని ఇది తీసుకెళ్ళి ఎవరో చచ్చిపోయిన దివాన్ గారి జవాన్ కి ఎరువిచ్చాడట"

"అదేమిటి?" అన్నాడు ఏం అర్థంకాక.

"ఏమీలేదు. ఇక్కణ్ణుంచి తీసుకెళ్ళిపోయాడు. అదీ ముఖ్యవిషయం. ఇప్పుడేమో అంతటి జవాన్ గారికి ఎరువిచ్చి తిరిగి పుచ్చుకోడమేమిటని గప్ చిప్‌గా ఊరుకొన్నాడు" అన్నాను కసిగా.

"ట్రాజెడీయే చేశారు మొత్తానికి" అన్నాడు శంకరం వెనక్కి జేరబడుతూ.

"ఏం?" అంది చంపకం.

"అది మాదికాదు. మా అమ్మ తల్లి అండ్ పినతల్లికి కామన్ ప్రాపర్టీ అన్నమాట. అదే— ఆ బాబిన్ పెట్టెలూ అన్నీ పినతల్లి దగ్గిర ఉండిపోయాయి చిన్న ఫైట్‌లో."

నాకర్థం కాలేదు. ఫైట్ జరిగితే కేవలం పెట్టెలూ బాబిన్లూ ఊడదీసి పట్టుకుపోవడమేమిటి? ఆ మాటే అంటే అతనికీ అర్థంకాలేదు.

"అదంతా నాకు తెలీదు ఇంజనీర్‌వి కనక బాగుచేసుకో అని మనకి ప్రెజంట్ చేసేసింది. ఇంతకీ ఇప్పటి కథాభాగం ఏమిటంటే ఆవిడ అమ్మాయేమో అది కావాలంటోందిట. అక్కడ బాగు చేసుకొంటాం పంపించమని వ్రాసింది."

"ప్రెజెంట్ చేసినది తిరిగి తీసుకోవడమేమిటి?" అన్నాను, అంతకన్నా ఏమీ చెప్పలేక.

"ప్రజంటు-అంటే-అదే రిపేర్ చెయ్యమని." అన్నాడు నవ్వుతూ.

"అయితే ఇవాళ సాయంత్రం ఆయనవస్తారు. అడుగుతా" అన్నాను ఏదో ఒకటి చెప్పాలికనక.

సాయంత్రం నిజంగానే మావయ్య వచ్చాడు. అర్జంట్ పనిమీద అమెరికా వెళ్ళి ఇప్పుడే వస్తున్నారట.

అడగనావద్దా అని ఆలోచిస్తున్నాను. శంకరంకి ఏంజవాబివ్వాలనీ కాదు, శంకరం వాళ్ళమ్మమ్మకి ఏంజవాబు చెప్పుకుంటాడనీ కాదు నా బాధ— ఎవరో నామరూపాలు తెలియనివాళ్ళ యంత్రం తెచ్చి మేం బాగుచేస్తే, మరొకళ్ళెవరో ఊరివాళ్ళు వాడుకుంటున్నారే! ఏమనాలి దీన్ని?



ఈ నెల 14న జరిగిన విశాఖ రచయితల సమావేశమప్పుడు తీసిన ఫోటో.